సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



నూనెలు సలసల..

పండుగల వేళ సామాన్యుడి నెత్తిన మోయలేని భారం పడింది. వంట నూనెల ధరలు వేడి పుట్టిస్తున్నాయి. 8లో▸



వీధి కుక్కల విజృంభణ

గ్రామాల్లో జనం బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులుగా కనిపిస్తున్నాయి. 8లో▸



కోరిక తీర్చలేదని..

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఏసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ శశాంక పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయం చేసుకుంటూ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

నీటిపారుదల నిర్వహణకు నిధులు ఇవ్వండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలో నీటిపారుదలకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో 9 చెక్ డ్యాంల నిర్మాణంకోసం రూ.20.68 కోట్లు, చెరువు వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు రూ.27.30 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిధులు త్వరగా మంజూరు చేస్తే నీటి పారుదల వనరులను కాపాడుంటామని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు



సమావేశంలో మాట్లాడుతున్న పర్వతాలు

షాద్‌నగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసి, గడీల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విలీన దినోత్సవం అని ఒక పార్టీ, విద్రోహ దినోత్సవం అని మరోపార్టీ మాట్లాడుతున్నాయని ఈ పార్టీలన్నీ ఆనాడు ఎక్కడపోయాయని ప్రశ్నించారు. సాయుధ పోరాటంలో పాల్గొనని నాయకులు ప్రస్తుతం ప్రగల్భాలు పలుకుతున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు శ్రీను, షకీల్, గడ్డం జంగయ్య, చంద్రబాబు, పవన్, శివ, విజయ్, ఆకాష్, సాయి, అజ్మత్ అలీ, ఎల్లయ్య, మైసయ్య పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే గిరిజనాభివృద్ధి

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్



నూతన కమిటీ నియామక పత్రాలు అందుకున్న వారితో రాష్ట్ర నాయకులు

కేశంపేట: ఐకమత్యంతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యం అవుతుందని సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాత్లావత్ రవినాయక్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజనులను ప్రభుత్వాలు ఓటు బ్యాంక్‌గా కాకుండా ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి రేఖ్యా నాయక్, సాంస్కృతిక సేన అధ్యక్షుడు భీమ్లా నాయక్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా సేన అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరుకు | వీర తిలకం

బాంచన్ దొర అన్నచేతులతో బంధూకులు పట్టించిన చరిత్ర

- భూస్వాముల గుండెల్లో దడపుట్టించిన భూ పోరాటం
- రాచకొండ కేంద్రంగా రంగారెడ్డి జిల్లా ఉద్యమం
- నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచిన నాటి నాయకులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూమి కోసం.. భుక్తికోసం.. వెట్టిచాకిరీ.. విముక్తికి.. బాంచన్ దొర నీ కాల్మొక్తాం అన్న వారితో బంధూకులు పట్టించిన చరిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిది. నిజాం నిరంకుశ పాలనలో దొరలు, భూస్వాముల గడీల్లో బంధీగా మారిన బడుగు.. బలహీన వర్గాల విముక్తికి దండుకట్టింది ఎర్రదండు. జాగిర్దార్, జమీందార్, భూస్వాములు, పటేల్, పట్వారీలు.. దేశ్‌ముఖ్ దొరలు.. రజకారులను మట్టికరిపించి. 'దున్నే వాడిదే భూమి' అన్న నినాదంతో..లక్షల ఎకరాల సర్కారు భూములను పేదల పంచిన చరిత్ర సాయుధ పోరాటానికి దక్కింది. ఈ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారు.

రాచకొండ కేంద్రంగా..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకత్వం కీలక భూమికి పోషించింది. రాంచకొండ ప్రాంత కేంద్రంగా పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వ స్ఫూర్తితో బీం రెడ్డిరాంరెడ్డి, చంద్ర రాజేశ్వర్, కాసం కృష్ణమూర్తి సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారు. అక్కడి నుంచే తమ దళాన్ని పెంచుకుంటూ.. రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో ఉద్యమాన్ని విస్తరించారు. కౌలు రైతులు, కూలీలు.. సబ్బండ వర్గాలపై నాటి భూస్వాములు, పెత్తందార్లు వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారు. వేలాది మంది ఉద్యమ నాయకులు, కౌలు రైతులు, నిరుపేదలను నిజాం సైన్యం పొట్టన పెట్టుకుంది. భూ పోరాటంలో భాగంగా ఆరుట్ల గ్రామంలో కోమటి లింగయ్య, చెన్నరెడ్డిగూడానికి చెందిన హనుమంతు, కౌలు రైతులను రజాకారులు చిత్ర హింసలు పెట్టి చంపారు. మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన హనుమంతును జైల్లోపెట్టి.. కనీసం మంచినీళ్లు ఇవ్వకుండా కఠినమైన శిక్షలు విధిస్తూ ప్రాణాలు పోయే వరకు బంధించారు. అమరుల త్యాగం.. వారి పోరాట పటిమ.. నిజాం పాలనను అంతమొందించి.. వెట్టి చాకిరీ విముక్తికి నాంది పలికింది.

శివన్నగూడెం క్యాంపుల్లో..

శివన్నగూడెం కేంద్రంగా రజకారుల క్యాంపుల్లో కౌలు రైతులను బంధించి చిత్ర హింసలకు గురిచేశారు. కమ్యూనిస్టు దళాలు రజాకారుల క్యాంపుపై మెరుపు దాడులు చేసి కౌలు రైతులు సోమయ్య, మల్లయ్యను రక్షించారు. కానీ భూస్వాములకు ఎదురు తిరిగిన కౌలు రైతులను రజకారులు సజీవ ఖననం చేశారు. బోడకొండ ఖిల్లా ప్రాంతంలో కౌలు రైతులను తమతోనే బొంద తీయించి.. అదే గోతిలో సజీవంగా పాతిపెట్టారు. ఈ ఘటనతో జిల్లాలో ఉద్యమం ఉధృతమైంది. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల, ధారురు ప్రాంతాల్లో యువత ఉద్యమంలో పాల్గొంది. ఆయా ప్రాంతాల్లో భూస్వాములకు ముచ్చెమటలు పట్టించారు. బర్ల శివయ్య, పోచబోయిన జంగయ్య, అడివయ్య, పోచయ్య, అరుట్ల గ్రామానికి చెందిన దానయ్య సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషిస్తూ ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం నింపారు. శివన్నగూడెం రజకారుల క్యాంప్‌పై దాడి చేసి భూస్వాముల భూములను పేదలకు పంపిణీ చేశారు. లోయపల్లి, అందోడ తండా, ఎల్లమ్మతండాలో 'దున్నే వాడిదే భూమి' అన్న నినాదంతో భూస్వా ముల భూముల్లో ఎర్రజెండాలు పాతారు. వేల ఎకరాలు నిరుపేద దళిత, గిరిజనులకు పంచిపెట్టారు.



గెరిల్లా పోరాటం

లెవీధాన్యం వసూలు చేయకుండా అడ్డుకోవడం, పటేల్, పట్వార్‌ల వద్ద రికార్డులు లాక్కోవడం, పన్ను వసూలు నిరాకరించడం, పన్నులు చెల్లించకుండా ఉండటం పెద్ద ఎత్తున సాగింది. వెల్లువలా ప్రజలు కదిలారు. దీంతో ప్రభుత్వం గడగడలాడిపోయింది. ఈ నేపథ్యంలో 1947లో ఆయుధాల సేకరణకు పార్టీ పిలుపునిచ్చింది. జాగీరుదార్లు, దేశ్‌ముఖ్‌ల గడీల మీద పడి ఆయుధాలు లాక్కోవడంతో సాయుధ గెరిల్లా పోరాటం ప్రారంభమైంది. నిజాం రజాకారుల క్యాంపులను తుడిచిపెట్టే ప్రక్రియ మొదలైంది. కృష్ణమూర్తికి ఈ ప్రాంతంలో ఉండి కార్యకలాపాలు సాగించాలని, రాచకొండ గుట్టల్లో రక్షణ తీసుకోవాలని సుందరయ్య చెప్పారు. ఆయన సూచన మేరకు కృష్ణమూర్తి రాచకొండ ప్రాంతానికి వెళ్లి అక్కడ దళాలను సిద్ధం చేశారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రదర్శనలు ఇచ్చారు. ఉద్యమంపై స్థానికుల్లో అవగాహన కల్పిస్తూ వారిని సన్నద్ధులను చేశారు. గ్రామాల్లో ఒక నిర్మాణ యంత్రాంగాన్ని సృష్టించారు. ఆ నాటి మహనీయుల త్యాగం.. పోరాట పటిమ నేటితరం ఉద్యమాలకు ఊతమిస్తోంది.

నిమజ్జనానికి గణనాథులు..

'లక్ష'ణంగా లడ్డూలు

నవరాత్రులు పూజలందుకున్న గణపతి లడ్డూలకు రూ.లక్షల్లో ధర పలికింది. జిల్లాలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన గణనాథులను సోమవారం భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. బొజ్జగణపయ్య ప్రసాదాన్ని దక్కించుకుంటే అంతా శుభం కలుగుతుందన్న నమ్మకంతో భక్తులు పోటాపోటీగా వేలం పాటల్లో పాల్గొన్నారు. రూ.లక్షల్లో అయినా తగ్గేదేలే అంటూ వాటిని కైవసం చేసుకున్నారు. అనంతరం నిమజ్జన శోభాయాత్రలు అంగరంగవైభవంగా కొనసాగాయి.



కడ్తాల్: మైసిగండిలో వినాయక శోభాయాత్రలో భక్తుల సందడి

- **తుక్కుగూడ:** బొడ్రాయి గణపతి వద్ద లడ్డూను రూ.7.51 లక్షలకు కొమ్మిరెడ్డి అంజిరెడ్డి దక్కించుకున్నారు. తుక్కుగూడ లక్ష్మీనగర్ యూత్ వద్ద మద్దుల చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు రూ.1.30 లక్షలకు కైవసం చేసుకున్నారు.
- **కడ్తాల్:** మైసిగండి పెద్ద వినాయకుడి లడ్డూను జాటవత్ రమేష్‌నాయక్ రూ.3.50లక్షలకు, గండి మైసమ్మ యూత్ లడ్డూను రూ.1.20 లక్షలకు రామవత్ కల్యాణ్ కైవసం చేసుకున్నారు. హనుమాన్ యూత్ లడ్డూను రూ.1.11 లక్షలకు రాజారాంనాయక్, చిన్న లడ్డూ రూ.1.01 లక్షలకు పాండు సొంతం చేసుకున్నారు. ముత్యాలమ్మ గుడి వద్ద రూ.1.21 లక్షలకు, దేపావత్ ఆలయం వద్ద రూ.1.20 లక్షలకు కృష్ణనాయక్, విస్లావత్ వినాయకుడి లడ్డూను 1.10 లక్షలకు నరేశ్, సభవట్ గణపతి లడ్డూను రూ.లక్షకు కొర్ర శ్రీను దక్కించుకున్నారు. కేతావత్ చిన్న వినాయకుడి వద్ద రూ.2.50 లక్షలకు కేతావత్ ప్రశాంత్, ప్యారడైజ్ మండపం వద్ద రూ.1.32 లక్షలకు ప్రేమ జవహర్‌లాల్ సొంతం చేసుకున్నారు.
- **మొయినాబాద్:** మండల పరిధిలోని సురంగల్‌లో శివాలయం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను రూ.1.50 లక్షలకు కందికొండ మల్లేశ్‌గౌడ్ దక్కించుకున్నారు.
- **తుర్కయంజాల్:** పురపాలక సంఘం పరిధిలోని పాటిగూడలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి లడ్డూను రూ.3.61 లక్షలకు బద్దం శేఖర్ రెడ్డి దక్కించుకున్నారు.
- **షాద్‌నగర్‌రూరల్:** షాద్‌నగర్ పట్టణంలోని శంకర్‌నగర్ కాలనీలో రూ.1,45,116కు మంచన్‌పల్లి రమేష్‌గౌడ్ లడ్డూను కైవసం చేసుకున్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.1,11,116కు సాయిప్రసాద్‌రెడ్డి, బృందావన్‌కాలనీలో రూ.1.9 లక్షలకు పులిమామిడి రాజేష్‌గౌడ్ సొంతం చేసుకున్నారు. ఆనంద్‌నగర్‌కాలనీలో రూ.3 లక్షలకు పెద్ద లడ్డు, రూ.2.35 లక్షలకు చిన్న లడ్డూను మనోజ్‌కుమార్, కీర్తన దంపతులు దక్కించుకున్నారు.
- **అబ్దుల్లాపూర్‌మెట్:** మైత్రీకుటీర్ కాలనీ వినాయక లడ్డూను రూ.1.70 లక్షలకు కాలనీ అధ్యక్షుడు మేకా మహేందర్‌రెడ్డి కైవసం చేసుకున్నారు.
- **ఇబ్రహీంపట్నం:** కర్ణంగూడలో శ్రీ ఆంజనేయ భజన మండలి ప్రతిష్ఠించిన మండపం వద్ద వినాయకుని లడ్డూ రూ.1.01 లక్షలకు యంపల్ల వినయ్‌రెడ్డి దక్కించుకున్నారు.



తుక్కుగూడ: రూ.7.51 లక్షలకు లడ్డూను దక్కించుకున్న అంజిరెడ్డి

పోలీస్ అలర్ట్!

గతానికి భిన్నంగా నిమజ్జనం ఏర్పాట్లు

- భారీగా షీ-టీమ్ బృందాల మోహరింపు
- సోషల్‌మీడియా పైనా ప్రత్యేక నిఘా
- వంతెన ఎత్తు తెలిసేలా ఎక్కడికక్కడ బోర్డులు

సాక్షి, సిటీబ్యూరో: నిమజ్జనం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు కమిషనరేట్ల అధికారులు నిఘా, తనిఖీలు, గస్తీ, సోదాలు ముమ్మరం చేశారు. జనసమ్మర్ద ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ వద్ద విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ప్రధాన ఊరేగింపు, నిమజ్జనం జరిగే చెరువుల దగ్గర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. సోషల్ మీడియా పుకార్లను తీవ్రంగా పరిగణించాలని నిర్ణయించారు. సర్వీస్ ప్రొవైడర్లతోనూ సమన్వయంగా పని చేస్తున్నారు. పుకార్లను వ్యాపింప చేస్తున్న ఎస్సెమ్మెస్‌లు, సోషల్‌మీడియాలపై టెక్నికల్ నిఘా ఉంచే ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేశారు. సామూహిక నిమజ్జనాన్ని తిలకించడానికి ప్రతి ఏడాదీ మహిళా భక్తులు సైతం అధిక సంఖ్యలో వస్తుంటారు. దీన్ని అదునుగా చేసుకుని ఆకతాయిలు, స్నాచర్లు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న సిటీ పోలీసులు ఈసారి గతానికి భిన్నంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవ్‌టీజర్లకు చెక్ చెప్పడానికి 100 షీ-టీమ్ బృందాలను వివిధ ప్రాంతాల్లో మోహరిస్తున్నారు. దీంతోపాటు స్నాచర్లకు చెక్ చెప్పేందుకు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్‌లకు చెందిన డెకాయ్ బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. వీరు అనుమానాస్పద, కీలక ప్రాంతాల్లో మఫ్టీల్లో సాధారణ వ్యక్తుల మాదిరి తిరుగుతూ నిఘా వేసి ఉంచుతారు. దాదాపు 40కి పైగా డెకాయ్ టీమ్స్ మోహరిస్తున్న ఉన్నతాధికారులు ఇందులో క్రైమ్ వర్క్‌పై పట్టున్న వాళ్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎవరికైనా పుకార్లతో కూడిన సందేశాలు వస్తే వాటిని తక్షణం పోలీసుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేస్తున్నారు. వీటిని మరో గ్రూపులోకో, వ్యక్తిగతంగానో ఫార్వర్డ్ చేస్తే సాంకేతిక నిఘాతో వారిని కనిపెట్టేలా ఏర్పాట్లు చేశారు. అలాంటి వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయనున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడానికి విగ్రహాల ఎత్తు కూడా ఓ కారణమయ్యే అవకాశం ఉంది. నగర వ్యాప్తంగా ప్రధాన ఊరేగింపులు జరిగే మార్గాల్లో 17 ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు ఉన్నాయి. వీటి ఎత్తును, విగ్రహాల ఎత్తుతో పోల్చుకుని అందుకు తగ్గ ఊరేగింపు మార్గాన్ని ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఊరేగింపు సమయంలో విగ్రహాలు వంతెనల వద్ద ఇరుక్కుపోయి తీవ్రమైన ట్రాఫిక్ జామ్స్.. ఒక్కోసారి శాంతి భద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. గణేశ్ విగ్రహం వెళ్లే ఊరేగింపు మార్గంలోని వంతెనల కన్నా కనీసం 5 అడుగులు తక్కువగా విగ్రహం ఎత్తు ఉండాలి. వంతెన కింది నుంచి ఉన్న రోడ్డు దగ్గర ఈ ఎత్తును పరిగణనలోకి తీసుకుంటారు. 'గణేశ్'ని తీసుకువెళ్లే వాహనం (లారీ, వ్యాన్ తదితరాలు) ఎత్తు గరిష్టంగా 5 అడుగులు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే విగ్రహం ఎత్తు వంతెన కంటే తక్కువగా ఉండాల్సిన అవసరం ఉంది. అలా సరిపోయే ఊరేగింపు మార్గాన్ని మండపాల నిర్వాహకులు ఎంపిక చేసుకోవాలి. ముందుగా మీరు అనుకున్న మార్గంలో ఉండే ఈ 'అవాంతరాలను' పరిగణలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలు ఎంపిక చేసుకుంటే ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కీలక ఘట్టం ముగుస్తుంది. వీటికి తోడు మెట్రో మార్గంలో ఎదురయ్యే అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరుతున్నారు. నగరంలోని దాదాపు ప్రతి ఫ్లైఓవర్, ఇతర బ్రిడ్జిల వద్ద వాటి ఎత్తును సూచిస్తూ ట్రాఫిక్ పోలీసులు బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రజాపాలన పేరుతో డ్రామాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

- ప్రజా వ్యతిరేకతలో కేసీఆర్‌ను మించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్: ప్రజా పాలన పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. పట్టణంలోని వివిధ గణేశ్ మండపాల వద్ద సోమవారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. ప్రజా వ్యతిరేకతలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను మించిపోయారని ఎద్దేవా చేశారు. గతంలో నియంతలా వ్యవహరించిన కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పి ఫాంహౌస్‌కు పరిమితం చేశారని అన్నారు. భవిష్యత్తులో రేవంత్‌రెడ్డికి కూడా అదే గతి పట్టడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలుచేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. డ్రామాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి మాటమరిచిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అధికారికంగా నిర్వహించే దమ్ము లేదన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆమె వెంట నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, పాతపల్లి కృష్ణారెడ్డి, రుషికేష్, కాసోజు శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఓఆర్‌ఆర్ పైనుంచి కిందపడిన లారీ

డ్రైవర్ మృతి

- క్లీనర్‌కు తీవ్ర గాయాలు
- నిద్ర మత్తే ప్రమాదానికి కారణం



ఔటర్‌పై నుంచి బోల్తాపడిన లారీ

అబ్దుల్లాపూర్‌మెట్: ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తున్న లారీ అదుపు తప్పి.. సర్వీస్ రోడ్డుపై పడిన ఘటనలో డ్రైవర్ మృతిచెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని సత్యసాయి జిల్లా హిందూపూర్ మోడల్ కాలనీకి చెందిన రాజగోపాల్‌చారి (28) తన లారీలో ఐరన్ లోడ్ తీసుకుని రాయ్‌పూర్ నుంచి బెంగళూర్ వెళ్తున్నాడు. ఘట్‌కేసర్ వద్ద ఓఆర్‌ఆర్ ఎక్కి తారామతిపేట టోల్‌గేట్ దాటాడు. 500 మీటర్ల దూరం వెళ్లగానే అదుపు తప్పిన లారీ ఔటర్‌పై నుంచి అంబర్‌పేట్ వెళ్లే సర్వీస్ రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ రాజగోపాల్‌చారి కేబిన్‌లో ఇరుక్కుని మృతిచెందగా గ్యాస్ కట్టర్ల సాయంతో బయటకు తీశారు. క్లీనర్ బాబాజాన్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా గణేశ్ నిమజ్జనం జరుగుతున్న సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సత్వర వైద్యాన్ని అందించేందుకు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, అంబులెన్సులను అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ మేరకు హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాల్లో ముందస్తుగా 30 చోట్ల హెల్త్ క్యాంప్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ట్యాంక్ బండ్‌కు లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు, పర్యాటకులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వీధి కుక్కల విజృంభణ



కొందుర్గులో కుక్కల దాడిలో గాయపడిన గొర్రెలు

- మూగ జీవాలతో పాటు మనుషులపైనా దాడి
- చిన్నారులు బయటకు వెళ్తే జంకుతున్న తల్లిదండ్రులు
- శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతి

కొందుర్గు: గ్రామాల్లో ప్రజలు బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఏ గల్లీల్లో చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. చిన్న పిల్లలనే కాదు పెద్దవారిపై సైతం దాడి చేసి పీక్కు తింటున్నాయి. ఇక చిన్నారులు బయటికి వెళ్తే ప్రాణాలతో ఇంటికి వస్తారా.. లేదా అని భయపడాల్సిన దుస్థితి నెలకొంది. నెలరోజుల క్రితమే జిల్లేడ్ చౌదరిగూడ మండలం బోయ ఆంజనేయులుకు చెందిన ఆవు, లేగదూడలపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఈ ఘటనలో లేగదూడ మృతిచెందింది. అయితే మరో పది రోజుల అనంతరం కొందుర్గులో వీరవిహారం చేశాయి. తాపీ మేస్త్రీగా పని చేసే కర్నూల్ జిల్లా మంత్రాలయానికి చెందిన గురురాజన్‌తోపాటు అక్కడే ఉన్న మరో ఇద్దరు మహిళలపై దాడిచేసి గాయపరిచాయి. కొందుర్గుకు చెందిన దయ్యాల శ్రీశైలంకు చెందిన మేకలపై దాడి చేసి నాలుగు మేకలు మృతిచెందాయి. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం కొందుర్గు మండలం ముట్పూర్‌కు చెందిన గొల్ల సాయిలు లేగదూడ కుక్కల దాడిలో మృతిచెందింది. ఇక తాజాగా ఆదివారం రాత్రి కొందుర్గుకు చెందిన ఎల్లంపల్లి శ్రీశైలం గొర్రెల మందపై దాడిచేసి 30 గొర్రెలను గాయపరిచాయి. గాయపడిన జీవాలు మృత్యువాతపడటంతో బాధిత రైతు లబోదిబోమని విలపించాడు. రూ.2 లక్షలకు పైగా నష్టపోయాయని వాపోయాడు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి..

ప్రతి గ్రామంలో వీధికుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయని, బయటికు వెళ్లాలంటేనే భయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. దీంతో చిన్నచిన్న పనులకు సైతం పిల్లలను బయటకు పంపడం లేదని పేర్కొంటున్నారు. పశువులు, లేగదూడలపై దాడిచేసి తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల దాడినుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, అధికారులను కోరుతున్నారు.

లారీ ఢీకొట్టి వృద్ధుడి మృతి



లింగయ్య(ఫైల్)

షాబాద్: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం షాబాద్ మండలం నాగర్‌గూడ చౌరస్తాలో చోటుచేసుకుంది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగర్‌గూడకు చెందిన ఎర్రవల్లి లింగయ్య(60) ఉదయం 7:30 గంటలకు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. అతివేగం, డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ఈ దుర్ఘటన జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లింగయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాల్‌నగర్ మండలం మాచారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌ను తాండ్య గోవింద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిని బావమరిది బీరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టంచేశారు.

పందిని ఢీకొట్టిన ఘటనలో వాహనదారుడు..



ప్రమాదంలో మృతి చెందిన సునీల్

కందుకూరు: బైక్ అదుపు తప్పి, పందిని ఢీ కొట్టిన సంఘటనలో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తూర్ మండలం ఖయాజీగూడ తండాకు చెందిన విస్లావత్ సునీల్(28) బేగరికంచె వద్ద ఉన్న అమేజాన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నిత్యం బైక్‌పై స్వగ్రామానికి వచ్చివెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు విధులు ముగించుకుని, తిరిగి వెళ్తుండగా కందుకూరు చౌరస్తా వద్ద అకస్మాత్తుగా పంది ఎదురైంది. తప్పించే క్రమంలో పందిని ఢీకొట్టగా బైక్ పైనుంచి కిందపడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు, పోలీసులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నూనెలు సలసల.. జనం విలవిల

- అమాంతం పెరిగిన వంట నూనెల ధరలు
- ప్యాకెట్‌పై ఏకంగా రూ.15 నుంచి రూ.20కి పెంపు
- పండుగల వేళ మోయలేని భారం



షాబాద్: పండుగల వేళ సామాన్యుడి నెత్తిన మరో భారం పడింది. వంట నూనెల ధరలు వేడి పుట్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడంతో మార్కెట్‌లో వీటి రేట్లకు రెక్కలొచ్చాయి. ఏకంగా ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ.20 పెంచి అమ్ముతున్నారు. ముడి పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై 20 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ విధిస్తూ కేంద్రం నిర్ణయించింది. శుద్ధి చేసిన నూనెలపై దిగుమతి సుంకాన్ని 12.5 నుంచి 32.5 శాతానికి పెంచింది. విదేశాల నుంచి నూనెలు దిగుమతి అయిన తర్వాత రిఫైనరీలకు చేరుకొని, అక్కడ శుద్ధి చేసిన అనంతరం ప్యాకింగ్ పూర్తయి మార్కెట్‌లోకి రావడానికి కనీసం వారం రోజులు పడుతుంది. వ్యాపారులు మాత్రం శనివారం నుంచే ధరలు పెంచేశారు. రూ.108 లీటర్ ఉన్న సన్‌ఫ్లవర్ రూ.130, లీటర్‌కు రూ.95 ఉన్న పామాయిల్ రూ.115, లీటర్‌కు రూ.100 ఉన్న కాటన్ ఆయిల్ రూ.120, రూ.170 ఉన్న పల్లినూనె రూ.210, లోకల్ నూనెలు రూ.100 నుంచి 120కి పెంచేశారు. నిత్యం వంటల్లో భాగమైన నూనె ధరలు పెరగడంపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా కల్తీ దందా

మార్కెట్‌లో కల్తీ నూనెల దందా జోరుగా కొనసాగుతోంది. వేరుశనగ గింజలు కొని గానుగాడిస్తే లీటర్ ధర రూ.300పై చిలుకు పలుకుతుంది. కానీ మార్కెట్‌లో రూ.210కే దొరుకుతోంది. సన్‌ఫ్లవర్ నూనెదీ అదే పరిస్థితి. ఇక రూ.100కు లీటర్ చొప్పున అమ్ముతున్న నూనెలు ఎలా తయారవుతున్నాయో తెలియని పరిస్థితి. కల్తీ నూనెల వాడకంతో ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని జనం వాపోతున్నారు. నూనెగింజల సాగు తగ్గుతుండడంతో వాటికి మద్దతు ధర ప్రకటించాలని, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి సివిల్ సప్లై ద్వారా వంట నూనెలు పంపిణీ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. రేషన్ షాపులను సూపర్ మార్కెట్లుగా మారుస్తామన్న ప్రభుత్వాల ప్రకటనలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. బియ్యం పంపిణీకి మాత్రమే అవి పరిమితమయ్యాయి.

ఏం కొనేటట్టు లేదు



మంచి నూనెల ధరలను అకస్మాత్తుగా పెంచేశారు. ఒకేసారి లీటర్‌కు రూ.20 నుంచి రూ.30 పెంచి అమ్ముతున్నారు. మార్కెట్‌కు వెళ్లి ఏం కొందామన్న అగ్గిలా మండుతున్నాయి. పండుగ పూట పిండి వంటలు చేసుకునే పరిస్థితి లేదు.

– పద్మమ్మ, తిర్మలాపూర్, షాబాద్ మండలం

కోరిక తీర్చలేదని కొట్టిచంపాడు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

- మహిళ అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడు బాబురావుకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్

కొత్తూరు: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి కేసును కొత్తూరు పోలీసులు ఛేదించారు. ఏసీపీ శ్రీనివాస్ సోమవారం మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరులో నివాసం ఉంటున్న యాదమ్మ(45) స్థానిక లేబర్ అడ్డా వద్ద కూలీ పని చేస్తుండేది. ఈ క్రమంలో గుంటూరు జిల్లాకు చెందిన రామారావుతో పరిచయం ఏర్పడి, ఒకే ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. వీరు ప్రకాశం జిల్లాకు చెందిన తాపీ మేస్త్రీ పేరం బాబురావు వద్ద పనికి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో యాదమ్మపై మోహం పెంచుకున్న బాబురావు వారితో సన్నిహితంగా మెలిగేవాడు. అప్పుడప్పుడు రామారావు ఇంటికి వెళ్లి ముగ్గురూ కలిసి మద్యం తాగేవారు. ఇదిలా ఉండగా రామారావు స్వగ్రామానికి వెళ్లాడని తెలుసుకున్న బాబురావు ఈనెల 11న రాత్రి 9గంటలకు కల్లు తీసుకుని యాదమ్మ ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ మద్యం తాగిన అనంతరం మనసులో మాట చెప్పాడు. దీనికి ఆమె అంగీకరించకపోవడంతో కోపోద్రిక్తుడై యాదమ్మపై దాడి చేశాడు. ఈక్రమంలో ఆమె మృతిచెందింది. మరుసటి రోజు విషయం తెలుసుకున్న మృతురాలి కూతురు రేణుక ఇంటికి వచ్చేసరికి తల్లి విగతజీవిగా పడిఉంది. ఈ విషయమై ఆమె ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా బాబురావుపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిజం ఒప్పుకొన్నాడు. అనంతరం నిందితుడి నుంచి రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనకు కృషి చేసిన సీఐ నర్సింహ్మరావు, ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ శ్రీనివాస్‌చారి, కానిస్టేబుళ్లను ఏసీపీ ప్రశంసించారు. వీరికి రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

పహాడీషరీఫ్: సొంత బావపై హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని పహాడీషరీఫ్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన మహేశ్‌ను అతని బామ్మర్ది ఒరుసు శ్రీను(25) ఆదివారం రాత్రి కత్తితో కడుపులో పొడిచాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదు ఆధారంగా ఇతరులను కూడా విచారిస్తున్నామన్నారు.

బాలలను ప్రోత్సహించడానికే సాంస్కృతికోత్సవం

దర్శకుడు కె.మోహన్



సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్‌లో రెయిన్‌బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బాలల సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు డ్యాన్స్, డ్రాయింగ్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై, విజేతలకు మెమొంటో, పాల్గొన్నవారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేశారు. అలాగే పిల్లలతో పాటు పెద్దలకు కళారత్న, సేవా రత్న అవార్డులను ప్రదానం చేశారు. 'బాలలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించాం' అని బాలల చిత్రం 'అప్పు' దర్శకుడు, రెయిన్‌బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి కె.మోహన్ పేర్కొన్నారు. బాలల చలన చిత్ర దర్శకుడు సైదా సురాజ్, నటీమణి వీఎస్ పద్మావతి, హీరోయిన్ లక్కీ, మేఘనా చౌదరి, నటుడు, సోషల్ వర్కర్ మూసా అలీఖాన్, బి.సత్యనాదం, ఆనంద్ సింగ్, గడ్డం మహిపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సాంస్కృతిక కార్యక్రమానికి లక్ష్మీ సాత్విక యాంకర్‌గా వ్యవహరించారు.

యూనియన్ బలోపేతానికి కృషి

నాంపల్లి: రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బలోపేతానికి కృషి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి భరణి భానూ ప్రసాద్ అన్నారు. సోమవారం రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు పలువురు ఎంప్లాయీస్ సంఘ్‌లో చేరారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ హైదరాబాద్ సీఎండబ్ల్యూ మెకానికల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు వేగి మురళీకృష్ణ నేతృత్వం వహించారు. మజ్దూర్ నేతలు రాజేష్ కుమార్ చౌదరి, వినోద్ కుమార్, సనత్‌నగర్ సీఎండబ్ల్యూ డిపోకు చెందిన రాజేష్ కుమార్ ఎంప్లాయీస్ సంఘ్‌లో చేరారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ చౌదరి, వినోద్‌కుమార్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఎంప్లాయీస్ సంఘ్‌ను మరింత బలోపేతం చేయడానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య నేతృత్వంలో పనిచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న వేగి మురళీకృష్ణ నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. రాబోయే రైల్వే ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.నేతలు ఎం.హెచ్.కిరణ్‌కుమార్, చంద్ర కిరణ్, సంతోష్, సనత్‌నగర్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, సాజిద్ బేగ్, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

వాగులో మునిగి వ్యక్తి మృతి



ఇబ్రహీం మృతదేహం

షాబాద్: వినాయక నిమజ్జనంలో అప్రశృతి చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి వెళ్లిన వ్యక్తి వాగులో మునిగి మృతిచెందాడు. సీఐ కాంతారెడ్డి వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన ఇబ్రహీం (32) ఆదివారం మిత్రులతో కలిసి వినాయక శోభాయాత్రలో పాల్గొన్నాడు. మధ్యాహ్నం 3గంటలకు చందనవెళ్లి శివారులోని కల్వారేట్ వాగులో స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అనంతరం స్నానం చేసేందుకు కొద్ది దూరంలో ఉన్న చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లారు. ఈత కొట్టేందుకు నీళ్లలో దూకిన ఇబ్రహీం పైకి రాలేదు. దీంతో కంగారు పడిన స్నేహితులు విషయాన్ని అతని కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలియజేశారు. గ్రామస్తులు, పోలీసులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా మృతదేహం పైకి తేలింది. పోస్టుమార్టం అనంతరం బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మినీ లారీ కింద పడి చిన్నారి దుర్మరణం



మృతి చెందిన చిన్నారితో తండ్రి కృష్ణ, కుటుంబ సభ్యులు

రాజేంద్రనగర్: మినీ లారీ కింద ఆడుకుంటున్న కుమారుడిని గమనించక తండ్రి వాహనాన్ని స్టార్ట్ చేసి ముందుకెళ్లడంతో చక్రాల కింద పడి చిన్నారి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్సై కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, గుడికల్ ప్రాంతానికి చెందిన కృష్ణ భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి బతుకు తెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చారు. కిస్మత్‌పూర్ ప్రాంతంలో సిమెంట్ ఇటుకలు తయారు చేసే వ్యక్తి వద్ద పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. కృష్ణ ఇటుకల తయారీతో పాటు మినీ డీసీఎంలో ఇటుకలను చేరవేసేవాడు. అతడి చిన్న కుమారుడు విఘ్నేశ్ (3) సోమవారం మధ్యాహ్నం పార్కు చేసిన మినీ డీసీఎం ముందు చక్రాల కింద ఆడుకుంటున్నాడు. దీనిని గుర్తించని కృష్ణ వాహనాన్ని స్టార్ట్ చేసి ముందుకు పోనివ్వగా చక్రాలు చిన్నారి విఘ్నేశ్ మీదుగా వెళ్లాయి. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దుండిగల్: రెడీమిక్స్ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బీహార్‌కు చెందిన రాకేష్‌రాయ్(33), గుడ్డి దంపతులు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చారు. రాకేష్ భౌరంపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ కూరగాయల దుకాణం నడుపుతున్నాడు. సోమవారం ఉదయం అతను భార్య గుడ్డితో కలిసి బైక్‌పై షాపూర్‌నగర్ వెళుతుండగా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలో మియాపూర్ నుంచి బహదూర్‌పల్లికి వైపు వెళుతున్న రెడీమిక్స్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాకేష్‌రాయ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య గుడ్డికి కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.అతివేగం కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. రెడీమిక్స్ వాహన డ్రైవర్ పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలను ప్రజలకు వివరించాలి

సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



వంశీచంద్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

కడ్తాల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకెళ్లి సత్తా చాటాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు లక్పతినాయక్, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, జగన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తీన్‌మార్ స్టెప్పులేసి.. తిరిగిరాని లోకాలకు

వినాయక నిమజ్జనంలో అపశృతి

- గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి
- అలకాపూర్ టౌన్‌షిప్‌లో విషాదం



శ్యాంకుమార్ (ఫైల్)

మణికొండ: వినాయక నిమజ్జనోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. అప్పటి వరకు తీన్‌మార్ స్టెప్పులకు అనుగుణంగా గంటన్నర పాటు స్టెప్పు లేసిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుప్పకూలడంతో హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేక పోవటంతో అతను మృతి చెందిన సంఘటన మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే.. అలకాపూర్ టౌన్‌షిప్ వినాయక ఉత్సవాలకు కోశాధికారిగా ఉన్న శ్యాంకుమార్(41) ఆదివారం నిమజ్జనోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. లడ్డూ వేలం పాట జరగటంతో దానిని దక్కించుకునేందుకు రూ. 15లక్షల వారు పాడాడు. అయినా పోటీదారుడు తగ్గక వదిలేయడంతో మరో వ్యక్తి దానిని రూ. 16లక్షలకు దక్కించుకున్నాడు. అయినా జోష్ తగ్గని శ్యాంకుమార్ లడ్డూ దక్కించుకున్న అతనితో కలిసి డ్యాన్స్ చేశాడు. మండపం నుంచి వంద అడుగుల దూరంలో ఉన్న యోగా సర్కిల్ వద్దకు ఊరేగింపు రాగానే డ్యాన్స్ చేస్తున్న అతను ఒక్కసారిగా కుప్పకూలాడు. దీనిని గుర్తించిన అతడి మిత్రులు సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు గంటపాటు విశ్వప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. శ్యాంకుమార్ మృతితో అలకాపూర్ టౌన్‌షిప్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. సోమవారం సాయంత్రం పుప్పాలగూడలోని స్మశానవాటికలో అతడి అంత్యక్రియలు నిర్వహించారు. అతడి భార్య ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, వారికి ఓ కుమారుడు ఉన్నాడు.

వైద్యులు చెప్పినా...

అతని గుండెకు ఉన్న రెండు వాల్వ్‌లు మూసుకుపోయాయని, శస్త్ర చికిత్స చేయించుకోవాలని వైద్యులు ఏడాది క్రితమే శ్యాంకుమార్‌కు సూచించినట్లు అతని మిత్రులు తెలిపారు. అయినా అతను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. ఆదివారం రాత్రి ఏకధాటిగా రెండు గంటల పాటు డ్యాన్స్ చేయటంతో శ్వాసకోశాల్లో ఒత్తిడి పెరిగి గుండె ఆగిపోయిందని డాక్టర్లు తెలిపారన్నారు.